భారత రాజ్యాంగం - ముఖ్య లక్షణాలు

భారత రాజ్యాంగ చట్టంపై రాజ్యాంగ పరిషత్ అధ్యక్షుడు డా।। బాబు రాజేంద్రప్రసాద్ 26 నవంబర్ 1949న సంతకం చేశారు. ఐదు అంశాలతో ఇది అమలులోకి వచ్చింది. 26 జనవరి 1950 నుంచి పూర్తి స్థాయిలో అమలులోకి వచ్చింది. దీని రూపకల్పనలో 1935 భారత ప్రభుత్వ చట్టం నుంచి ఎక్కువ అంశాలను తీసుకున్నారు.

రాజ్యాంగ చట్టం రూపొందించడానికి రెండేళ్ల 11 నెలల 18 రోజులు పట్టింది. ఈ విధంగా రూపొందించిన చట్టాన్ని డాక్టర్ సుభాష్ కాస్యప్ ''ది కాన్స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా ఈజ్ ఎ మోస్ట్ కాంప్రహెన్సివ్ డాక్యుమెంట్''గా పేర్కొన్నాడు.

రాజ్యాంగ చట్టం- ముఖ్య లక్షణాలు

- ప్రవేశిక
- రాత పూర్వకమైంది
- ఏక పౌరసత్వం
- ప్రాథమిక హక్కులు
- ఆదేశిక సూత్రాలు
- ప్రాథమిక విధులు
- పార్లమెంటరీ వ్యవస్థ
- అధ్యక్ష తరహా ప్రభుత్వం
- అత్యవసర అధికారాలు
- ఏకకేంద్ర-సమాఖ్య విధానం
- సుప్రీంకోర్టు
- న్యాయసమీక్ష
- దృఢ-అదృఢ రాజ్యాంగం
- కేంద్ర-రాష్ట్ర సంబంధాలు
- సవరణలు మొదలైనవి

ప్రవేశిక

- ప్రవేశికను రాజ్యాంగ పీఠిక అని కూడా అంటారు.
- మన రాజ్యాంగ నిర్మాతలు అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా మొదలైన రాజ్యాల నుంచి ప్రేరణ పొందారు.
- పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఏడు అంశాల తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తీర్మానాలే ప్రవేశికగా మారింది.
- ప్రవేశికను రాజ్యాంగ పరిషత్ 22 జనవరి 1947న ఆమోదించింది.
- 42వ సవరణ ద్వారా (1976) రెండు పదాలు- సెక్యులరిజమ్, సోషలిజమ్ చేర్చారు.

రాత పూర్వకమైన రాజ్యాంగం

అమెరికా, కెనడా, ఫ్రాన్స్ మొదలైన రాజ్యాంగ చట్టాల మాదిరిగా మన రాజ్యాంగం కూడా రాతపూర్వకమైంది. వాస్తవానికి రాజ్యాంగ చట్టంలో 22 భాగాలు, 395 నిబంధనలు, 8 షెడ్యూళ్లు ఉండేవి. ప్రస్తుతం 24-25 భాగాలు, 444 పైగా నిబంధనలు, 12 షెడ్యూళ్లు, 4 అనుబంధాలు ఉన్నాయి. (అనుబంధాలు- జమ్ము-కాశ్మీర్, భారతచట్టం, 44, 65వ సవరణల గురించి రాశారు.) రాజ్యాంగ చట్టంలో సుమారు 90,000 పదాలు ఉన్నాయి.

ఏక పౌరసత్వం

మన రాజ్యాంగ చట్టం ఏక పౌరసత్వాన్ని కల్పించింది. రెండో భాగంలో 5 నుంచి 11వ నిబంధనల వరకు పొందుపరచారు.

ప్రాథమిక హక్కులు :

భారత రాజ్యాంగ చట్టం మూడో భాగంలో 12 నుంచి 35వ నిబంధన వరకు పొందుపరచారు. వాస్తవానికి ప్రాథమిక హక్కులు ఏడు.

- సమానత్వపు హక్కు (నిబంధన 14 నుంచి 18 వరకు)
- స్వేచ్ఛ హక్కు (19-22)
- దౌర్జన్యాన్ని ప్రతిఘటించే హక్కు (23-24)
- మతస్వాతంత్ర్య హక్కు (25-28)
- విద్యా సాంస్కృతిక హక్కు (29-30)
- ఆస్తి హక్కు (31) (44వ రాజ్యాంగ సవరణ ద్వారా ఆస్తి హక్కు చట్టబద్ధమైన హక్కుగా మారింది)
- రాజ్యాంగ పరిహార హక్కు (32)
- ప్రస్తుతం 21ఎ నిబంధన ప్రకారం విద్యహక్కును 2002లో పొందుపరచారు.

ఆదేశిక సూత్రాలు

రాజ్యాంగ చట్టం నాల్గోభాగంలో 36 నుంచి 51వ నిబంధనల వరకు ఆదేశిక సూత్రాలు ఉన్నాయి. ప్రారంభంలో 16 ఆదేశిక సూత్రాలుండేవి. ప్రస్తుతం 26 ఉన్నాయి. డాక్టర్ ఎం.పి. శర్మ వీటిని మూడు భాగాలుగా విభజించారు. అవి

- సాంఘిక-ఆర్థిక సూత్రాలు
- గాంధీ సూత్రాలు
- ఉదారవాద సూత్రాలు

పై సూత్రాలు సమాజానికి ఎక్కువగా ఉపయోగపడతాయి. వీటిని నాన్-జుడీషియల్ రైట్స్ అని అంటారు. వీటికి న్యాయస్థానాల ద్వారా

ఏ విధమైన రక్షణ ఉండదు.

ప్రాథమిక విధులు

- నాల్గో భాగంలో ఆదేశిక సూత్రాలతో 51వ నిబంధన ద్వారా ప్రాథమిక విధులను జతచేశారు.
- ఈ విధులను యు.ఎస్.ఎస్.ఆర్ (ప్రస్తుతం రష్యా) నుంచి తీసుకొన్నారు.
- స్వరణ్‌సింగ్ కమిటీ ఎనిమిది ప్రాథమిక విధులను సిఫారసు చేసింది.
- 42వ సవరణ(1976) ద్వారా రెండు, 86వ సవరణ(2002) ద్వారా ఒక ప్రాథమిక విధిని చేర్చారు.

దృఢ-అదృఢ రాజ్యాంగం

- మన భారత రాజ్యాంగం అమెరికా రాజ్యాంగం మాదిరిగా దృఢమైంది కాదు. బ్రిటన్ రాజ్యాంగం మాదిరిగా అదృఢమైందీ కాదు. ఇది దృఢ, అదృఢ రాజ్యాంగ సమ్మేళనం.

పార్లమెంటరీ వ్యవస్థ

రాజ్యాంగ ప్రవేశికలో భారతదేశం సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా పేర్కొన్నారు. రాజ్యాంగానికి సంపూర్ణ అధికారం ఉందని, అదేవిధంగా ప్రజలకు కూడా సంపూర్ణ అధికారం ఉందని పేర్కొంటూ పార్లమెంటుకు ఎక్కువ ప్రాముఖ్యత కల్పించారు.

అత్యవసర అధికారాలు :

- రాష్ట్రపతికి అత్యవసర అధికారాలు భారత రాజ్యాంగంలో 18వ భాగంలో 352 నుంచి 360వ నిబంధన వరకు పొందుపరిచారు.
- అత్యవసర అధికారాలు మూడు
  - జాతీయ అత్యవసర అధికారాలు(352-355)
  - రాష్ట్రపతి పాలన (356-359)
  - ఆర్థిక అత్యవసర అధికారాలు (360)
- ఏ దేశమైనా యుద్ధాన్ని ప్రకటించినప్పుడు గానీ, భూభాగాన్ని ఆక్రమించినప్పుడు గానీ, సిపాయిలు తిరుగుబాటు లేదా బెదిరింపులు చేసినప్పుడు గానీ రాష్ట్రపతి జాతీయ అత్యవసరాన్ని ప్రకటించవచ్చు.
- రాష్ట్రంలో రాష్ట్ర యంత్రాంగం విఫలమైనప్పుడు గానీ, పార్టీ ఫిరాయింపుల సమయంలో గానీ రాష్ట్రపతి పాలన ఏర్పాటు చేయవచ్చు.
- ఆర్థిక సంక్షోభం ఏర్పడినప్పుడు ఆర్థిక అత్యవసర అధికారాన్ని రాష్ట్రపతి ఉపయోగిస్తారు.
- అత్యవసర కాలంలో భారత రాష్ట్రపతి దేశాన్ని పాలిస్తారు. ప్రాథమిక హక్కులు రద్దవుతాయి.

ఏక కేంద్ర-సమాఖ్య రాజ్యాంగం :

- భారత రాజ్యాంగ చట్టం ఏకకేంద్ర-సమాఖ్య రాజ్యాంగ లక్షణాలను కలిగి ఉంది.
- ఏక పౌరసత్వం, ఒకే న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘం, రాజ్యసభలో రాష్ట్రాలకు అసమాన ప్రాతినిధ్యం కలిగి ఉండటం, అత్యవసర అధికారాలు మొదలైనవి ఏక కేంద్ర లక్షణాలు.
- కేంద్ర-రాష్ట్రాల మధ్య పంపిణీ, దృఢరాజ్యాంగం, లిఖిత రాజ్యాంగం, స్వతంత్ర ప్రతిపత్తి గల న్యాయస్థానం సమాఖ్య రాజ్యాంగ లక్షణాలు.

న్యాయసమీక్ష :

- మన రాజ్యాంగ చట్టంలో న్యాయసమీక్ష ఉంది. దీనిని అమెరికా రాజ్యాంగం నుంచి తీసుకున్నారు. సమీక్ష అంటే తీర్పులను తిరిగి పునరాలోచించి న్యాయం చేయడం.
- సుప్రీంకోర్టుకు, హైకోర్టుకు న్యాయసమీక్ష అధికారం ఉంది.

కేంద్ర-రాష్ట్ర సంబంధాలు :

- భారత రాజ్యాంగ చట్టంలో 11,12వ భాగంలో 245 నుంచి 293 నిబంధన వరకు కేంద్ర-రాష్ట్ర సంబంధాల గురించి పేర్కొన్నారు.
- ఈ సంబంధాలు శాసన సంబంధాలలోను, పాలన సంబంధాలలోను, ఆర్థిక సంబంధాలలోను ఉంటాయి.
- శాసన సంబంధాలు కేంద్ర-రాష్ట్ర ఉమ్మడి జాబితాలలో ఉన్నాయి.
- కేంద్ర జాబితాలో ప్రస్తుతం 99, రాష్ట్ర జాబితాలో 61, ఉమ్మడి జాబితాలో 52 అంశాలు ఉన్నాయి.

ప్రపంచ రాజ్యాంగాల్లో అత్యంత సుధీర్ఘమైందిగా భారత రాజ్యాంగాన్ని పేర్కొంటారు. విశాల భారతంలో విభిన్న వర్గాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని దీన్ని రూపొందించారు. అందువల్లనే హెచ్.వి.కామత్ భారత రాజ్యాంగాన్ని ఐరావతంతో పోల్చారు. ఎన్నో విశిష్ట లక్షణాలున్న మన రాజ్యాంగంపై వివిధ పోటీ పరీక్షల్లో అనేక ప్రశ్నలు అడుగుతున్నారు.

1. భారతదేశంలో వివిధ రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ జాతుల/తెగల పరిపాలనకు సంబంధించిన విషయాలను తెలిపే షెడ్యూల్?
(సివిల్స్ 2008)

ఎ) 3వ బి) 5వ సి) 7వ డి) 9వ

సమాధానం: బి

వివరణ: దేశంలోని వివిధ రాష్ట్రాల్లోని షెడ్యూల్డ్ జాతుల పరిపాలనకు సంబంధించిన విషయాలను ఐదో షెడ్యూల్ తెలిపితే, అస్సాం, త్రిపుర, మేఘాలయ, మిజోరంలో షెడ్యూల్డ్ జాతుల పరిపాలన కోసం ప్రత్యేకంగా ఆరో షెడ్యూల్‌ను ఏర్పాటు చేశారు.

2. భారత రాజ్యాంగంపై వ్యాఖ్యానించే అధికారం ఎవరికుంది? (గ్రూప్ 1-1994)

ఎ) రాష్ట్రపతి బి) లోక్‌సభ అధ్యక్షుడు
సి) పార్లమెంట్ డి) ఉన్నత న్యాయస్థానం

సమాధానం: డి

వివరణ: భారత రాజ్యాంగాన్ని అధికారికంగా వ్యాఖ్యానించే అధికారం సుప్రీకోర్టుకు ఉంది. రాజ్యాంగ అధిపతి రాష్ట్రపతి రాజ్యాంగ సవరణాధికారం పార్లమెంట్ కలిగియున్నది.

3. రాజ్యాంగ సదస్సులోని వివిధ కమిటీలు, వాటి అధ్యక్షులకు సంబంధించి కింది వాటిలో తప్పుగా జతపర్చింది?(గ్రూప్1 2004)

ఎ) రూల్స్ కమిటీ-డాక్టర్ రాజేంద్రప్రసాద్
బి) అడ్వయిజరీ కమిటీ-వల్లభాయ్ పటేల్
సి) ప్రాథమిక హక్కుల ఉపకమిటీ-జె.బి. కృపలానీ
డి) స్టిరింగ్ కమిటీ- జవహర్‌లాల్ నెహ్రూ

సమాధానం: డి

వివరణ: స్టిరింగ్ కమిటీ అధ్యక్షులు కూడా డాక్టర్ బాబూ రాజేంద్ర ప్రసాదే. కేవలం అభ్యర్థులను కొంత గందరగోళపరచడానికి మాత్రమే రెండు కమిటీలు రాజేంద్రప్రసాద్ అధ్యక్షులుగా ఉన్న వాటిని ఇచ్చారు.

4. కింది వ్యాఖ్యల్లో ఏ అంశం 4వ షెడ్యూల్‌కు సరైన అర్థాన్నిస్తుంది? (సివిల్స్-2001)

ఎ) కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య జరిగిన అధికార పంపిణీ
బి) రాజ్యాంగంలో గుర్తించిన భాషలను గురించి తెలుపుతుంది
సి) రాజ్యసభలో రాష్ట్రాలకు కల్పించిన ప్రాతినిధ్యం
డి) షెడ్యూల్డ్ జాతుల పరిపాలన విషయాలను గురించి తెలుపుతుంది

సమాధానం: సి

వివరణ: రాజ్యసభలో రాష్ట్రాలకు గల ప్రాతినిధ్యాన్ని తెలిపే ఈ షెడ్యూల్‌లో మార్పులు చేర్పులను పార్లమెంట్ చేస్తుంది. దేశంలో కొత్త రాష్ట్రాల ఏర్పాటైనప్పుడు ఈ షెడ్యూల్‌ను తప్పని సరిగా సవరించాలి.

5. భారత రాజ్యాంగంలోని ఏ షెడ్యూల్డ్ పార్టీ ఫిరాయింపు నిరోధక సూత్రాలను తెలుపుతుంది? (సివిల్స్- 1998)

ఎ) 2వ బి) 5వ సి) 8వ డి) 10వ

సమాధానం: డి

వివరణ: 1985లో రాజీవ్ గాంధీ ప్రభుత్వ కాలంలో 52వ రాజ్యాంగ సవరణ ద్వారా పార్టీ ఫిరాయింపు నిరోధక చట్టాన్ని చేస్తూ రాజ్యాంగంలో 10వ షెడ్యూల్‌ను చేర్చారు. రాజకీయ పార్టీ అనే పదం ఈ షెడ్యూల్‌లో మాత్రమే ఉంది.

6. భారత రాజ్యాంగం ఒరిజినల్ కాపీకి సంబంధించి వాస్తవికత? (సివిల్స్-2005)

1) భారత రాజ్యాంగం 20 భాగాలను కలిగి ఉంది.
2) రాజ్యాంగంలో మొత్తం అధికరణల సంఖ్య 390
3) రాజ్యాంగ సవరణల ద్వారా 9, 10, 11, 12 షెడ్యూళ్లను చేర్చారు

ఎ) 1,2 వాస్తవం బి) 2 మాత్రమే వాస్తవం
సి) 3 మాత్రమే వాస్తవం
డి) 1, 2, 3 వాస్తవం

సమాధానం: సి

వివరణ: ఒరిజనల్ రాజ్యాంగం 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు, 22 భాగాలను కలిగి ఉండేది. రాజ్యాంగ సవరణల ద్వారా 9, 10, 11, 12 షెడ్యూళ్లను చేర్చారు.

7. భారతదేశంలో సర్వోన్నతమైందిగా దేన్ని పేర్కొంటారు?

ఎ) భారత రాజ్యాంగం బి) భారత పార్లమెంట్
సి) భారత ప్రభుత్వం డి) భారత ప్రజలు

సమాధానం: ఎ

వివరణ: భారత రాజ్యాంగం సర్వోన్నతమైంది. మనదేశంలో రాజ్యాంగ ఆధిక్యత ఉంటుంది. భారత పార్లమెంట్, ప్రభుత్వం, ప్రజలు రాజ్యాంగానికి అనుగుణంగా వ్యవహరించాల్సి ఉంటుంది.

8. భారతరాజ్యాంగంలో ఎన్నో సవరణల ద్వారా 9వ షెడ్యూల్‌ను చేర్చారు? (సివిల్స్-2003)

ఎ) 1వ బి) 8వ సి) 9వ డి) 40వ

సమాధానం: ఎ

వివరణ: భూ సంస్కరణల చట్టాలకు న్యాయ సమీక్ష పరిధి నుంచి రక్షించడానికి మొదట రాజ్యాంగ సవరణ ద్వారా 1951లో 9వ షెడ్యూల్‌ను మన రాజ్యాంగంలో చేర్చారు.

9. భారతదేశంలో రాజకీయ అధికారానికి మూలస్థానం?
(గ్రూప్ 1-1994)

ఎ) ప్రజలు బి) పార్లమెంట్

సి) రాజ్యాంగం డి) ఏదీ కాదు

సమాధానం: ఎ

వివరణ: భారత రాజ్యాంగ ప్రవేశికలో భారత ప్రజలమైన మేము తమకు తాము సమర్పించి నట్లుగా పేర్కొన్నారు. ఆ విధంగా తమకు తాము సమర్పించినట్లుగా పేర్కొనడం ద్వారా మనదేశంలో అధికారానికి మూలం ప్రజలు అని అర్థం.

10.భారత రాజ్యాంగ లక్ష్యాల్లో ఒకటైన ఆర్థిక న్యాయాన్ని దేనిలో పొందుపర్చారు?

(ఎంపి డీవో 1997)

ఎ) పీఠిక, ఆదేశిక సూత్రాలు

బి) పీఠిక, ప్రాథమికాంశాలు

సి) ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు

డి) పీఠిక, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాలు

సమాధానం: ఎ

వివరణ: రాజ్యాంగ ప్రవేశిక, ఆదేశిక సూత్రాల్లో మాత్రమే ఆర్థిక న్యాయం గురించి పేర్కొన్నారు. మన రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కుల్లో వ్యక్తి స్వేచ్ఛ, రాజకీయ ప్రజాస్వామ్యం గురించి పేర్కొ న్నారు తప్ప ఆర్థిక న్యాయం గురించిన ప్రస్తావన లేదు.

11.భారత న్యాయవ్యవస్థకు సంబంధించి కింది వాటిలో భిన్నమైంది?

ఎ) స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయసంస్థ

బి) న్యాయ సమీక్ష

సి) ఏకీకృత న్యాయవ్యవస్థ

డి) రాజ్యాంగ ఆధిక్యత

సమాధానం: సి

వివరణ: స్వతంత్ర ప్రతిపత్తిగల న్యాయ వ్యవస్థను, న్యాయసమీక్ష, రాజ్యాంగ ఆధిక్యతలను అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించారు. ఏకీకృత లేదా సమీకృత న్యాయవస్థను బ్రిటన్ నుంచి గ్రహించారు.

12.42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో ''సామ్య వాద, లౌకిక'' అనే పదాలతో పాటు చేర్చిన మరొక పదం?

ఎ) ఆర్థిక న్యాయం బి) ఏకత

సి) సమగ్రత డి) సోదరభావం

సమాధానం: సి

వివరణ: 1976లో 42వ రాజ్యాంగ సవరణ ద్వారా రాజ్యాంగ ప్రవేశికలో చేర్చిన మరొక ముఖ్య పదం సమగ్రత. భారతదేశ సమైక్యత సమగ్రతలకు భంగం కలిగించకుండా వాటి సంరక్షణకు పాటు పడతామనే అంశాన్ని తెలుపుతున్నది.

13.భారత రాజ్యాంగ సవరణ ప్రక్రియకు చొరవ చూపేది?

ఎ) ప్రజలు బి) పార్లమెంట్

సి) రాష్ట్రాలు డి) రాష్ట్రపతి

సమాధానం: బి

వివరణ: మనదేశంలో ప్రజలకు రాజ్యాంగ సవరణ ప్రక్రియకు సంబం ధించి స్విట్జర్లాండ్ మాదిరిగా చొరవ తీసుకునే అవకాశం లేదు. అమెరి కాలో ఉన్నట్లు రాష్ట్రాలకు సవరణ ప్రతిపాదన చేసే అవకాశం లేదు. భారత పార్లమెంట్‌కు మాత్రమే సవరణ ప్రతిపాదన చేసే హక్కుంది.

14.భారత రాజ్యాంగం సమన్యాయ పాలన అనే అంశం ఏ దేశం నుంచి గ్రహించింది?

ఎ) బ్రిటిష్ బి) అమెరికా

సి) ఫ్రెంచ్ డి) జపాన్

సమాధానం: ఎ

వివరణ: బ్రిటన్‌లో ఏవీ డైసీ ప్రవేశపెట్టిన సమ న్యాయపాలనను ఆధారం చేసుకుని మన రాజ్యాంగ నిర్మాతలు సమానత్వ భావనను రూపొందించారు.

15.భారత రాజ్యాంగానికి సంబంధించి వాస్తవిక అంశం?

ఎ) దృఢ లక్షణాల కంటే అదృఢ లక్షణాలు ఎక్కువగా కలిగిఉంది.

బి) అదృఢ లక్షణాల కంటే దృఢ లక్షణాలు సమానంగా కలిగి ఉంది

సి) అదృఢ, దృఢ లక్షణాలు సమానంగా కలిగి ఉన్నాయి

డి) రాజ్యాంగాన్ని సవరించే పద్ధతిని అమెరికా నుంచి గ్రహించారు

సమాధానం: ఎ

వివరణ: భారత రాజ్యాంగంలోని ఎక్కువ అంశాలను పార్లమెంట్ సాధారణ మెజార్టీతో సవరిస్తుంది. అందువల్ల దృఢ లక్షణాల కంటే అదృఢ లక్షణాలే అధికంగా ఉన్నాయి.

16.భారత రాజ్యాంగం కల్పించే పౌరసత్వానికి సంబంధించి వాస్తవిక అంశం?

ఎ) బహుళ పౌరసత్వం బి) ద్వంద పౌరసత్వం

సి) ఏక పౌరసత్వం

డి) పౌరసత్వం ఉమ్మడి జాబితాలో ఉంది

సమాధానం: సి

వివరణ: మనదేశంలో ఏక పౌరసత్వం ఉంది. ఒక జమ్మూ కాశ్మీర్‌లో మాత్రమే ద్వంద పౌరసత్వం ఉంటుంది. 16 దేశాల్లోని ప్రవాస భారతీయులకు కల్పించిన పౌరసత్వం కేవలం నివాస, ఆర్థిక, వ్యాపార, విద్యా విషయాలకే పరిమితం. వారికి రాజకీయ హక్కులుం డవు.

భారత రాజకీయ వ్యవస్థ

భారత్ ఒక దేశంగా ఎప్పటినుంచో కొనసాగుతోంది భారతీయులంతా ఒకేజాతి అనే భావన బ్రిటిష్ వారి పాలన కాలంలో బాగా నాటుకు పోయింది. ఆధునిక కాలంలో ప్రతి దేశానికి ఒక రాజ్యాంగం ఉంది. పాలకుల, పాలితుల మధ్య సంబంధాన్ని క్రమబద్ధం చేసే నియమనిబంధనల సంపుటే రాజ్యాంగం! భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం.

భారత్‌కు వచ్చిన ముగ్గురు బ్రిటన్ కేబినెట్ మంత్రులు భారత జాతీయ కాంగ్రెస్, ఇండియన్ ముస్లింలీగ్‌లను కలిశారు. అవిభక్త భారతదేశానికి అధికార బదిలీ జరగాలని కాంగ్రెస్ పట్టుబడితే... 'ద్విజాతి' సిద్ధాంత ప్రాతిపదికన భారత ఉపఖండాన్ని ఇండియా, పాకిస్థాన్ అనే రెండు డొమినియన్‌లుగా విభజించాలని ముస్లింలీగ్ పట్టుపట్టింది. రాజీ సూత్రంగా, ప్రస్తుతానికి భారత్‌ను విభజించే ప్రసక్తి లేదని, పదేళ్ల తర్వాత అవసరమైతే విభజించవచ్చని మంత్రిత్రయ సంఘం సూచించింది. రాజ్యాంగ పరిషత్‌కు పరోక్షంగా ఎన్నికలు జరిగేలా, స్వదేశ సంస్థానాలు రాజ్యాంగ రూపకల్పనలో పాలు పంచుకునేలా నిర్ణయించింది. ఎన్నికల్లో ముస్లింలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ముస్లింలీగ్... మిగతా ప్రాంతాల్లో కాంగ్రెస్, ఇతర రాజకీయ పక్షాలు గెలిచాయి.

రాజ్యాంగ పరిషత్:

సచ్చిదానంద సిన్హా రాజ్యాంగ పరిషత్‌కు తాత్కాలిక అధ్యక్షునిగా వ్యవహరిస్తే... 1946 డిసెంబరు 11న రాజేంద్రప్రసాద్ శాశ్వత అధ్యక్షునిగా ఎంపికయ్యారు. 389 మందితో కూడిన ఈ రాజ్యాంగ పరిషత్ ప్రథమ సమావేశం 1946 డిసెంబరు 9న జరిగింది.ముస్లింలీగ్ ప్రతినిధులు దీన్ని బహిష్కరించారు. దాంతో 207 మంది మాత్రమే సమావేశానికి హాజరయ్యారు. మౌంట్ బాటన్ ప్రణాళిక (3.6.1947) మేరకు పాకిస్థాన్‌కు ప్రత్యేక రాజ్యాంగ పరిషత్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పాకిస్థాన్ పరిధిలోకి వచ్చిన ప్రాంతాల పరిషత్ సభ్యులు అవిభక్త పరిషత్‌లో సభ్యత్వాన్ని కోల్పోయారు. ఫలితంగా భారత రాజ్యాంగ పరిషత్ సభ్యుల సంఖ్య 299కు తగ్గింది. 1946 డిసెంబరు 13న జవహర్‌లాల్ నెహ్రూ ప్రవేశపెట్టిన ''లక్ష్యాల తీర్మానం''...1947 జనవరి 22న ఏకగ్రీవంగా ఆమోదం పొందింది. ఈ తీర్మానమే రాజ్యాంగ పీఠిక.

రాజ్యాంగ ముసాయిదా:

1947 డిసెంబర్ 14 అర్ధరాత్రి సమావేశమైన రాజ్యాంగ పరిషత్... స్వతంత్ర భారత శాసనసభా బాధ్యతలను కూడా స్వీకరించింది. బి.ఆర్.అంబేద్కర్ అధ్యక్షతన ఏర్పడిన రచనా కమిటీ (26-8-1947) ముసాయిదా (డ్రాఫ్ట్) రాజ్యాంగాన్ని రూపొందించింది. బి.యన్.రావ్ రాజ్యాంగ సలహాదారుగా, యస్.యన్.ముఖర్జీ ప్రధాన లేఖకునిగా విశేష సేవలందించారు. రాజ్యాంగపరిషత్ ముసాయిదా రాజ్యాంగాన్ని చర్చించి.. 2,473 సవరణలను పరిశీలించి, 1949 నవంబరు 26న ఆమోదించింది. 284 మంది సభ్యులు 1950 జనవరి 24న రాజ్యాంగ అసలు ప్రతి పై సంతకాలు చేశారు. 1950 జనవరి 26న రాజ్యాంగ పరిషత్ తాత్కాలిక పార్లమెంటుగా మారింది. రాజ్యాంగ పరిషత్ మొత్తం 11 సమావేశాలు జరిపింది. 2 ఏళ్ల 11 నెలల 17 రోజులపాటు కొనసాగింది. సమావేశమైన 165 రోజుల్లో 114 రోజులు ముసాయిదా రాజ్యాంగం పరిశీలన జరిగింది. పరిషత్ విధి నిర్వహణలో తోడ్పడిన ప్రధానమైన కమిటీలకు ప్రముఖులు అధ్యక్షులుగా వ్యవహరించారు. వీటిలో స్టీరింగ్ కమిటీ, సభా కమిటీ, ప్రాథమిక హక్కుల ఉపకమిటీ, అల్ప సంఖ్యాక వర్గాల ఉపకమిటీ ముఖ్యమైనవి.

రాజ్యం.. జాతి:

భారతదేశం, దాని ప్రజలు, సంస్కృతి, చరిత్ర, పురాతనమైనప్పటికీ.. ఆధునిక పరిభాషలో వాడే 'రాజ్యం' అనే పదానికి కొత్త. మనం తరచుగా దేశం, జాతి, రాజ్యం అనే భావనలను ఒకే అర్థం వచ్చేలా వాడుతుంటాం. 'దేశం' అనే పదం భౌగోళిక స్వభావాన్ని స్ఫురింపజేస్తే... 'జాతి' ప్రజల మధ్య భావోద్వేగ ఐక్యతను తెలియజేస్తుంది ; 'రాజ్యం' మానవ సముదాయ రాజకీయ స్వాతంత్ర్య స్థితిని తెలియజేస్తుంది. ఇండియా ఒక 'దేశం'గా ఎప్పటినుంచో కొనసాగుతోంది. భారతీయులంతా ఒకే 'జాతి' అనే భావం బ్రిటిష్ వారి పాలనలో బాగా నాటుకుపోయింది. అది ఉద్యమంగా పరిణమించి 'భారత రాజ్య' అవతరణకు దారితీసింది. 1947 ఆగస్టు 14 వరకు భారత దేశం, భారతజాతి అనే రెండు భావాలు భారత ఉపఖండానికి వర్తిస్తే... 1947 ఆగస్టు 15 నుంచి భారతదేశానికి, భారతజాతికి 'రాజ్యం' అనే హోదా లభించింది. ప్రస్తుతం మనం భారతదేశానికి చెంది, ఆ జాతి ప్రజలుగా గుర్తింపు పొందుతూ... ఒక స్వతంత్ర రాజకీయ వ్యవస్థ(రాజ్యం)గా కొనసాగుతున్నాం. నిర్దిష్ట భూభాగంలో నివసిస్తూ, వారి జీవితాన్ని క్రమబద్ధం చేయడానికి ప్రభుత్వాన్ని ఏర్పరచుకొని, బహిర్గత విషయాలలో స్వాధీనతను అనుభవించే మానవ సముదాయమే 'రాజ్యం'.

రాజ్యాంగం అంటే..!!

'రాజ్య లక్ష్యాలను, స్వభావాన్ని తెలియజేస్తూ... వాటిని కార్యరూపంలోకి తేవడానికి ఏర్పాటు చేసిన శాసన, కార్యనిర్వాహక, న్యాయ శాఖల వ్యవస్థీకరణ, అధికారాలను తెలియజేస్తూ.. పౌరుల హక్కు

లను, బాధ్యతలను వివరించే నిబంధనల సంపుటి'. 1950 జనవరి 26 నుంచి అమలులోకి వచ్చిన రాజ్యాంగం దేశానికంతటికి అత్యున్నత శాసనం. దేశ సరిహద్దుల్లో నివసించే ప్రజలు, కొనసాగే వ్యవస్థలు దీని నిబంధనల మేరకు కొనసాగుతాయి. ప్రతి రాజ్యాంగానికి కొంత ప్రత్యేకత ఉంటుంది. రాజ్యాంగ రచన చేసినప్పుడు మన నాయకులు వివిధ దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి.. మన దేశ భూత, వర్తమాన, భవిష్యత్తులను దృష్టిలో పెట్టుకొని సుదీర్ఘమైన రాజ్యాంగాన్ని రూపొందించారు. 395 ప్రకరణలు, 8 షెడ్యూళ్ళతో అత్యున్నత న్యాయశాసనం... గత 58 ఏళ్లలో అనేక మార్పులకు గురైంది. 'ప్రకరణ' నిబంధనల సంపుటి అయితే, 'షెడ్యూలు' వాటి వివరణ. అయితే, అన్ని ప్రకరణలకు షెడ్యూళ్ళు లేవు.

పార్లమెంటరీ తరహా:

భారత రాజ్యాంగానికి 1935 భారత ప్రభుత్వ చట్టం మూలాధారం. 'భారత రాజ్యాంగం, 1935 భారత ప్రభుత్వ చట్టం నఖలు' అని విమర్శకులు వ్యాఖ్యానించటం అతిశయోక్తిగా అనిపించినా... కొంత వాస్తవం లేకపోలేదు. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం.. అర్ధ సమాఖ్య.. కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజన.. తదితర అంశాలు ఆ చట్టంనుంచి తీసుకున్నారు. రాజ్యాంగ పరిషత్‌లో కొందరు సభ్యులు అధ్యక్ష తరహా వ్యవస్థ వైపునకు మొగ్గినా... చివరికి పార్లమెంటరీ తరహా ప్రభుత్వాన్నే అంగీకరించారు.

అమెరికా నుంచి ప్రాథమిక హక్కులు:

రిపబ్లిక్, ప్రాథమిక హక్కులు, స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన న్యాయ వ్యవస్థ, సమాఖ్య వ్యవస్థ వంటి అంశాలను అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహిస్తే.. ఆదేశిక సూత్రాలను ఐరిష్ రాజ్యాంగం నుంచి తీసుకున్నారు. అవశేషాధికారాలపై చట్టాలు చేసే అధికారం పార్లమెంటుకు ఉండటాన్ని కెనడా రాజ్యాంగం నుంచి గ్రహించారు. అత్యవసరాధికారాలను జర్మనీ నుంచి, రాజ్యాంగ సవరణ విధానాన్ని దక్షిణాఫ్రికా నుంచి స్వీకరించారు. ఏడో షెడ్యూల్‌లో పొందుపరచిన ఉమ్మడి జాబితా భావనను ఆస్ట్రేలియా నుంచి, 42వ రాజ్యాంగ సవరణ ద్వారా చేర్చిన ప్రాథమిక విధులు సోవియట్ యూనియన్ నుంచి తీసుకున్నారు. అంబేద్కర్ అభిప్రాయపడినట్లు మంచిని ఇతరుల నుంచి నేర్చుకోవటంలో తప్పేమీ లేదు. అంత మాత్రాన భారత రాజ్యాంగంలో స్వతఃసిద్ధ భావాలు ప్రస్ఫుటించలేదని కాదు. ఏకీకృత న్యాయవ్యవస్థ, ప్రభుత్వ సర్వీసుల గురించి రాజ్యాంగంలో ప్రస్తావన, ఎన్నికల సంఘం, ఆర్థిక సంఘం, కంప్ట్రోలర్, ఆడిటర్ జనరల్ లాంటి వ్యవస్థలకు రాజ్యాంగ పరమైన రక్షణ, షెడ్యూల్డ్ కులాలు, తెగలు, అల్పసంఖ్యాక వర్గాలకు రక్షణ, ఏక పౌరసత్వం మొదలైన అంశాలు మన రాజ్యాంగ మౌలికతను తెలుపుతాయి.

అతి పెద్ద రాజ్యాంగం:

భారత రాజ్యాంగం లిఖిత రాజ్యాంగం. పరిమాణంలో అతి పెద్దది. సవరణ విషయంలో సరళ, దృఢ సమ్మేళనమైంది. పార్లమెంటరీ తరహా ప్రభుత్వం, న్యాయ సమీక్షాధికారం, వ్యక్తిగత స్వేచ్ఛను పరిరక్షించటానికి ప్రాథమిక హక్కులు, సామాజిక సంక్షేమానికి ఆదేశిక సూత్రాలు, లౌకిక స్వభావం, ఏకపౌరసత్వం, రిపబ్లిక్ వ్యవస్థ, అర్ధ సమాఖ్య తదితర ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి!!